క్లుప్తంగా

చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



గోపాల్‌పేట: గ్రామదేవతలు మన సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుస్తాయని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఏదుల మండలంలోని చెన్నారంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

తాగునీటి ఇబ్బందులు రానీయం



ఆత్మకూర్: పట్టణంలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ చికినె శశిధర్ తెలిపారు. ఆదివారం స్థానిక పదో వార్డులోని వెంకటేశ్వరకాలనీలో బోరు చెడిపోవడంతో మరమ్మతు చేపట్టి సత్వర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో మిషన్ భగీరథ నీటితో పాటు బోర్ల ద్వారా అవసరమున్న చోట ట్యాంకర్ల ద్వారా ప్రతినిత్యం ఎలాంటి అవాంతరాలు లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు



వనపర్తి రూరల్: గ్రామంలో నిర్మించే సీసీ రోడ్డు పనులను నాణ్యవంతంగా చేపట్టి, తప్పనిసరిగా క్యూరింగ్ చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆదివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కుమ్మరివాడలో ఆర్‌ఆర్ నిధుల కింద మంజూరైన రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



పాన్‌గల్: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఆర్‌ఎంపీ డాక్టర్ స్వామి పాన్‌గల్ నుంచి వనపర్తికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వనపర్తి మండలం నాగవరం నుంచి బండపల్లికి ద్విచక్ర వాహనంపై నాగేంద్రం వస్తున్నాడు. అన్నారంతండా సమీపంలో ఎదురుగా వచ్చే ఆర్‌ఎంపీ బైక్‌ను నాగేంద్రం బైక్ ఢీకొనడంతో ఆర్‌ఎంపీ స్వామి కుడి కాలుకు తీవ్ర గాయం కాగా.. నాగేంద్రానికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఆర్‌ఎంపీని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

అమరచింత: పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం మట్టల ఆదివారం పండుగగా జరుపుకొంటామని పాస్టర్ హ్యాపీపాల్ తెలిపారు. ఏసు క్రీస్తు నామాన్ని స్మరిస్తూ పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట చిన్నారుల కొబ్బరి మట్టలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.



అందని కమీషన్ డబ్బులు

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు
- మూడు సీజన్లలో 3 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం సేకరణ
- పెండింగ్‌లో రూ.96లక్షలు



వరిధాన్యం ఆరబెడుతున్న రైతులు (ఫైల్)



పుర్గర్‌చర్లలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు (ఫైల్)

వీపనగండ్ల: మండల మహిళా సమాఖ్య ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేసిన సభ్యులకు రావాల్సిన కమీషన్ బకాయి డబ్బులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ వ్యక్తుల ద్వారా వడ్డీకి డబ్బులు తెచ్చి కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు ఏర్పాటు చేశామని వారు వాపోతున్నారు. ఏడాది కాలంగా కమీషన్ డబ్బులు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన కమీషన్ డబ్బులు ఇప్పించాలని మహిళా సంఘ సభ్యులు కోరుతున్నారు.

మూడు సీజన్లుగా..

గత వానాకాలం, యాసంగి సీజన్‌తో పాటు ఈ వానాకాలంలో దొడ్డు ఒడ్లు, సన్నరకం వడ్లను మహిళా సంఘం సభ్యులు కొనుగోలు చేశారు. గత వానాకాలంలో మండల మహిళా సమాఖ్య ద్వారా 10 గ్రామాల్లో సెంటర్లు ఏర్పాటు చేసి 1,610 మంది రైతుల నుంచి 90,117 క్వింటాళ్ల ధాన్యం కొన్నారు. అందుకు ప్రభుత్వం రైతులకు రూ.18.74కోట్లు చెల్లించింది. అందుకు గాను మహిళా సమాఖ్యకు రూ.28.83 లక్షల కమీషన్ డబ్బులు ఇవ్వాల్సి ఉంది. గత యాసంగిలో 10 సెంటర్ల ద్వారా 1,218 మంది రైతులతో 57,375 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేయగా.. రైతుల ఖాతాల్లో రూ.12.64కోట్లు జమచేశారు. కానీ మహిళా సంఘాలకు రావాల్సిన రూ.18.36లక్షల కమీషన్ మాత్రం చెల్లించలేదు. ఈ సంవత్సరం వానాకాలంలో 13 సెంటర్ల ద్వారా 1,535 మంది రైతులతో 8,848 క్వింటాళ్ల సన్నవడ్లు కొనుగోలు చేయగా రూ.2.63కోట్లు రైతు ఖాతాలో జమచేశారు. కానీ కమీషన్ ద్వార చెల్లించాల్సిన రూ.2.58లక్షలు నేటికీ చెల్లించలేదు. అలాగే 9 సెంటర్లు ద్వారా 1,387 మంది రైతుల ద్వార 71,817 క్వింటాళ్లను కొనుగోలు చేయగా.. రూ.16.66కోట్లు రైతు ఖాతాలో జమచేశారు. కమీషన్ ద్వార చెల్లించాల్సిన రూ.22.98లక్షలు మహిళా సంఘ సభ్యులకు ఇవ్వలేదు.

మూడు సీజన్లు ముగిసినా

గత రెండు సీజన్లు, ఈ సంవత్సరం వానాకాలంలో దొడ్డు, సన్నరకాలను కలిపి 5,750 మంది రైతులతో 3లక్షల క్వింటాళ్ల వడ్లను కొనుగోలు చేయగా.. మహిళా సంఘ సభ్యులకు రూ96లక్షలు కమీషన్ రూపేనా రావాల్సి ఉంది. వచ్చిన కమీషన్ డబ్బుల్లో 45శాతం స్త్రీనిధిలో డిపాజిట్ చేయాల్సి.. ఉండగా 55శాతం కమీషన్ డబ్బులను వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఏర్పాట్లు గన్నీ బ్యాగుల కొనుగోలు, హమాలీ, రైతుల తాగునీటి వసతులు తదితర వాటికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక క్వింటా ధాన్యం కొనుగోలు చేస్తే రూ.32 కమీషన్ ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం 18 నెలలు గడిచినా కమీషన్ డబ్బులు సకాలంలో ఇవ్వకపోతే తాము చేసిన ఖర్చులకు, మిత్తీలకే సరిపోతాయని మహిళా సంఘం సభ్యులు వాపోతున్నారు.

సకాలంలో చెల్లిస్తే ప్రయోజనం



గ్రామ సంఘాల్లో డబ్బులు లేకున్నా రైతులకు ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశంతో సొంత డబ్బులతో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. కమీషన్ డబ్బులు సకాలంలో చెల్లిస్తే మహిళా సంఘాలు మరింత బలోపేతం అవుతాయి. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి సీజన్ ముగిసిన వెంటనే కమీషన్ డబ్బులు చెల్లించాలి.

– శాంతమ్మ, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఏడాదిన్నర కాలంగా మహిళా సంఘాలకు రావాల్సిన డబ్బులు రాలేదన్న మాట వాస్తవమే. ప్రతి సీజన్‌లో మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు చేయగా రావాల్సిన కమీషన్ వివరాలను సకాలంలోనే ఉన్నతాధికారులకు అందజేశాం. త్వరగా కమీషన్ డబ్బులు వచ్చేందుకు మరోమారు ఉన్నతాధికారులకు అవసరమైన సమాచారం అందజేస్తాం.

– బిచ్చన్న, ఏపీఎం మండల మహిళా సమాఖ్య, వీపనగండ్ల

యువత బాధ్యతతో మెలగాలి



వనపర్తి రూరల్: ప్రతి ఒక్కరూ బాధ్యతతో దేశాన్ని ముందుకు నడిపించాలని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చందాపూర్‌లో వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3, 4 వలంటీర్ల ఆధ్వర్యంలో సమ్మర్ స్పెషల్ క్యాంప్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో మొక్కలు నాటి నీరు పోశారు. యువతకు మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ స్థాపించి 56 ఏళ్లు గడుస్తున్నా నేటికీ దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే దశలోనే ఉందన్నారు. ఒక విద్యార్థి వలంటీర్, భారతీయ పౌరులు సమాజంలోని మార్పుని ప్రత్యక్షంగా చూసినప్పుడే ఎన్‌ఎస్‌ఎస్ ఫలాలు నెరవేరుతాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్, ప్రోగ్రాం ఆఫీసర్ ధాంసింగ్, హెచ్‌ఎం శంకరయ్య, సహాయ కోఆర్డినేటర్ వెంకటస్వామి, యాదగిరిగౌడ్, రంజిత్, మల్లయ్య, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ



యూటీఎఫ్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యయనం, సామాజిక స్పృహ లక్ష్యంతో, హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా భావిస్తూ ఉపాధ్యాయుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. యూటీఎఫ్ హక్కులతో పాటు బాధ్యతలు కూడా నెరవేరుస్తూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ఆర్.రామన్‌గౌడ్, చిరంజీవి, మురళి, లక్ష్మణ్‌నాయక్, రాధాకృష్ణ, అయోధ్య రాముడు, సూరయ్య, కృష్ణ, సురేష్, గంగన్న, రాము, సాయిబాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

24 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు



అప్పారెడ్డిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఖిల్లాఘనపురం: మండలంలో వ్యవసాయానికి, ఇళ్ల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా 24 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ కొండయ్య తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే మండలంలో 100 కేవీ, 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఉప్పరిపల్లిలో 3, సోళీపురం 3, కొత్తపల్లితండా 1, గార్లబండతండా 2, అప్పారెడ్డిపల్లి 3, ఖిల్లాఘనపురం 3, మల్కిమియాన్‌పల్లి 1, కొత్తపల్లి 1, మామిడిమాడ 2, సల్కెలాపురం 3, వెనికితండా 1, వెంకటాంపల్లి గ్రామంలో 1 బిగించారు.

అంబేడ్కర్ జయంతి వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఉత్సవాల కమిటీ నాయకులు

అమరచింత: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ జిల్లా చైర్మన్ గంధం గట్టయ్య, వైస్ చైర్మన్ మాదారి భోజరాజు కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వేడుకల వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న శక్తులపై కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరు చెన్నకేశవులు, ఉత్సవాల కమిటీ కో కన్వీనర్ రమేష్, అరుణ్, రామ్మూర్తి, ప్రకాశం, శ్యాంకుమార్, దేవరాజ్, సాంసంగ్, బుడగ జంగం గోపాల్, రాంపురం రాముల పాల్గొన్నారు.

అంగన్‌వాడీలనే శాశ్వత ఉద్యోగులుగా నియమించాలి

వీపనగండ్ల: రాష్ట్రప్రభుత్వం ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీస్కూళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆ స్కూళ్లలో అర్హత ఉన్న అంగన్‌వాడీ టీచర్లనే శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని మండల అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు సుగుణబాయి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు బీఈడీ, టీటీసీ లు పూర్తి చేశారని, మిగతా టీచర్ల వలే వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పాఠశాలల్లో వీరిని నియమించాలన్నారు.

రైతుల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం

పాన్‌గల్: రైతుల హక్కుల సాధన కోసం రైతులతో కలిసి ఉద్యమిస్తామని రైతు సంఘం జిల్లా నాయకులు బాబునాయక్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని రేమద్దుల, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా రైతు సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చి వారి హక్కులను కాలరాస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం రైతుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రవినాయక్, రాములు నాయక్, రాజునాయక్, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

3 ఇసుక ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్ పట్టివేత

వనపర్తి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్‌ను ఆదివారం పట్టుకుని, యజమానులపై కేసు నమోదు చేశామని పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గోపాల్‌పేట రోడ్డు, జరిపోతుల మైసమ్మ వద్ద వనపర్తి మున్సిపాలిటీలోని నందిమల్ల గడ్డకు చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రొక్లెయినర్‌తో ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా పెట్రోలింగ్ పోలీసులు వెళ్లి అనుమతి పత్రాలు చూపించమని కోరారు. కానీ సరైన పత్రాలు చూపకపోవడంతో ప్రొక్లెయినర్‌తో పాటు 3 ట్రాక్టర్లను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నందిమల్లగడ్డకు చెందిన ట్రాక్టర్ యజమాని తెలుగు రాములు, నందిమల్ల అశోక్, నందిమల్ల రాములు, ప్రొక్లెయినర్ యజమాని వినయ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సన్నబియ్యం పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని పాత యాపట్లలో సన్న బియ్యాన్ని మాజీ సర్పంచ్ రమేష్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నబియ్యాన్ని అందజేస్తున్నారని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరికి నెల 6 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.

లీకేజీలకు మరమ్మతు చేపట్టాలి



పాన్‌గల్‌లో గేట్‌వాల్ లీకేజీ



చిక్కేపల్లిలో లీకేజీతో పాటు అపరిశుభ్రంగా మారిన ట్యాంకు పరిసరాలు

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి వృథాను అరికట్టాలని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంతో తాగునీరు వృథా అవుతోంది. మండల కేంద్రంలో గేట్‌వాల్ లీకేజీ, పైపులైన్ లీకేజీ మరమ్మతు కోసం గుంత తవ్వినా.. పనులు చేపట్టకపోవడం, మండలంలోని చిక్కేపల్లిలో పైపులైన్ల లీకేజీలకు మరమ్మతు చేపట్టకపోవడంతో నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిక్కేపల్లిలో లీకేజీలతో పాటు ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో తాగునీరు కలుషితం అవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతు చేపట్టడంతో పాటు ట్యాంకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయితీ కార్యదర్శులను వివరణ కోరగా.. లీకేజీలకు మరమ్మతు చేపట్టడంతో పాటు ట్యాంకు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం సిద్ధిస్తుంది



వీరరాఘవపూర్‌లో త్రైతసిద్ధాంత ప్రభోద ప్రచారం చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: త్రైతసిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని వీరరాఘవపూర్‌లో భగవద్గీత ప్రచార ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల సందేశాలు, భగవద్గీత శ్లోకాలను వినిపించారు. భగవద్గీత పఠనంతో జ్ఞానం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. విశ్వావసునామ సంవత్సరం, శ్రీరామనవమి విశేషాలను వివరించారు. అలాగే త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో కొత్తకోట ప్రభోద సేవా సమితి నిర్వాహకులు విజయభాస్కర్‌రెడ్డి, రాఘవేంద్రచారి, రవి, యాది, మనోహర్, మంజుల, సబిత, సుదర్శన్, బాలరాజు, ఆంజనేయులు, ఉమారాణి, లావన్య, స్వప్న, కాలమ్మ, సువర్ణ, భాగ్య, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్యుడు మండల్



కొత్తకోటలో బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్ అని బీసీ నాయకులు కొనియాడారు. ఆదివారం బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన బీసీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ సమాజంలో బీసీలు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నించి ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం వదులుకున్న గొప్ప వ్యక్తి బీపీ మండల్ అని అన్నారు. కార్యక్రమంలో రాములుయాదవ్, మాజీ కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, వెంకటన్నగౌడ్, న్యాయవాది రాములుయాదవ్, హోటల్ కురుమూర్తి, వహీద్, విజయ్, జక్కన్న, ఖదీర్‌పాషా తదితరులు ఉన్నారు.

వనపర్తి టౌన్: బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బీపీ మండల్‌యాదవ్ సేవలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, బాలేమియా, గంధం గట్టయ్య, గద్వాల కృష్ణ, నాగరాజు, తగువుల వెంకటస్వామి, నరసింహ, రాములు, వెంకటస్వామి, కురుమూర్తి, విజయ్ కుమార్, మధుసూదన్ రావు బండలయ్య పాల్గొన్నారు.

‘అపూర్వ’ సమ్మేళనం



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2004–2005 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. దాదాపుగా 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు, గురువులు ఆప్యాయంగా పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు బలరాంమూర్తి, ఎండీ గౌస్, దశరథరెడ్డి, మధుసూదన్‌రావు, సుధీర్‌రెడ్డి, వరలక్ష్మి, ఉమాదేవి, పావని, వరప్రసాద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల్లో సుస్థిర పాలన



ఖిల్లాఘనపురం గణపసముద్రం రిజర్వాయర్ అలుగు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



కిష్టగిరిలో మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

వనపర్తి రూరల్: కేంద్రంలో కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వంతోనే గ్రామాల్లో సుస్థిర పాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మెంటపల్లి పరుషోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు సందా వెంకటేష్ ఆధ్వర్యంలో మండలంలోని నాచహల్లి, కిష్టగిరి గ్రామాల్లో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో ఆయనతో పాటు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికీ వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం వారి ఫొటోలు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఘోరంగా విఫలమైందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, నాగరాజు, తిరుమలయ్య, యాదగిరి, శ్రీకాంత్, సురేష్ , తిరుపతి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, చరణ్, చెన్నయ్య, బీసన్న పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

వనపర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఇంటికి చేరేలా పట్టణంలో అవగాహన కల్పిస్తున్నామని బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బచ్చు రాము అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని 33వ వార్డు వల్లభ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు కవిత, జ్ఞానేశ్వర్, నాగరాజు, అర్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టవా...?

ఖిల్లాఘనపురం: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ నాయకులు గణపసముద్రం చెరువు, అలుగు, సీఎస్‌సీ ఆస్పత్రి తదితర వాటిని పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యల గురించి అక్కడ ఉన్న రోగులు, ఆస్పత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గణపసముద్రం చెరువు రిజర్వాయర్ అలుగు పెరగడం, రిజర్వాయర్‌లో మునిగే భూములకు ఇస్తామన్న పరిహారం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖిల్లాఘనపురం గ్రామానికి ఆనుకొని ఉన్న గణపసముద్రం చెరువు రిజర్వాయర్ అలుగు పెంచడం వలన రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా గ్రామంలోకి నీళ్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.25 లక్షల పరిహారం ఇస్తామని చెప్పినా.. అధికారం చేపట్టిన తర్వాత దాని గురించి మాట్లాడటం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్, విక్రం, దశరథం, గోపాల్‌రెడ్డి, శివశంకర్, ఆశన్న, బెస్త శివ, రాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జార్జ్‌రెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగుదాం

కొత్తకోట రూరల్: అట్టడుగు పేద వర్గాలు, మహిళలకు, విద్య కావాలని ఆధిపత్య వర్గాలను ఎదిరించి విద్యార్థుల, మహిళల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన జార్జ్‌రెడ్డి స్ఫూర్తితో నేటితరం విద్యార్థులు ముందుకు సాగాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం కొత్తకోటలోని బీసీ బాలుర హాస్టల్‌లో జార్జ్‌రెడ్డి 53వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార్జ్ బతికుంటే తమ దౌర్జన్యాలు సాగవని మనువాదులు పన్నాగం పన్ని కత్తులతో దాడి చేసి హతమార్చినా.. నాటి నుంచి నేటి వరకు ప్రగతిశీల గొంతులు జార్జ్ ఆశయాన్ని నినదిస్తూనే ఉందన్నారు. దేశంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద, మనువాద రాజ్య స్థాపన కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మోదీ విధానాలు దేశ లౌకిక వ్యవస్థకు, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తికి పెను ప్రమాదకరంగా మార్చుతూ విద్యా సంస్థలను మత ప్రయోగశాలలుగా మార్చేందుకు, నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరించే కుట్రపూరిత చర్యలకు ఒడిగట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నవీన్, శంకర్, ప్రభు, తరుణ్, నరేష్, రమేష్, కాశీం , శివ, గోపి, ధనుష్ తదితరులు ఉన్నారు.